సాక్షి
రంగారెడ్డి
మంగళవారం ၊ 6 ၊ ఆగస్టు ၊ 2024



భూ పంపిణీ చేయాలి

ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



వర్గీకరణకు వ్యతిరేకంగా..

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును నిరసిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. 8లో▸



అప్రమత్తత అవసరం

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్‌నేరాలతో జాగ్రత్తగా ఉండాలని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ఎంజీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



సాక్షి, రంగారెడ్డి జిల్లా: మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీలో ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కట్టికోల కాశీనాథ్‌కు తమిళనాడులోని వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఆన్‌లైన్ విద్య– తెలంగాణలోని ఎంపిక చేసిన జిల్లాలోని ఆంగ్ల మాధ్యమిక స్థాయి ఉపాధ్యాయుల అభ్యాసాలు మరియు సవాళ్లు' అంశంపై ఇంగ్లిష్‌లో పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకుగానూ డాక్టరేట్ ప్రకటించింది. విట్ యూనివర్సిటీ చాన్సలర్ విశ్వనాథ్, ప్రొఫెసర్ అనిల్ డి సహస్రబుద్ధి సమక్షంలో కాశీనాథ్ పట్టా అందుకున్నారు. ఎంజీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ హరిలీల సహఅధ్యాపకులు, మిత్రులు కాశీనాథ్‌ను అభినందించారు.

నిరుపేదలకు ఉచితంగా ఆక్సిజన్ ఫిల్లింగ్



కుంట్లూర్‌-తట్టిఅన్నారం మార్గంలో రవీంద్ర ఆక్సిజన్ ప్లాంటు

అబ్దుల్లాపూర్‌మెట్ : నిరుపేదలకు ఉచితంగా ఆక్సిజన్ ఫిల్లింగ్ చేసి ఇచ్చేందుకు పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధి కుంట్లూర్‌లోని రవీంద్ర ఆక్సిజన్ ప్లాంట్ యాజమాన్యం ముందుకు వచ్చింది.ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన ఆక్సిజన్ వాయువును అందించాలన్న ఉద్దేశంతో ప్లాంట్లు నెలకొల్పామని నిర్వాహకులు తెలిపారు. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని ప్రజలతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ తదితర పరిసర ప్రాంతాల్లో నివసించే నిరుపేదలకు అత్యవసర పరిస్థితుల్లో ఆక్సిజన్ అవసరమైతే రోగి ఆధార్ కార్డుతో పాటు వైద్యులు సూచించిన రసీదు, ఖాళీ సిలిండర్ తీసుకువస్తే ఉచితంగా ఫిల్లింగ్ చేసి ఇస్తామన్నారు. ఈ ప్రక్రియను వారం రోజుల్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కుంట్లూరు నుంచి తట్టి అన్నారం వెళ్లే దారిలో పల్లవి ఇంజనీరింగ్ కళాశాల పక్కనే ప్లాంట్ ఉందని.. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని వారు సూచించారు.

'స్కిల్ వర్సిటీ' వరకు రోడ్డు నిర్మాణానికి భూసర్వే

ఇబ్రహీంపట్నం: ఓఆర్‌ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేటలో ఏర్పాటు కానున్న స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 200 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి భూ సర్వే కొనసాగుతోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ యూనివర్సిటీ నిర్మాణానికి భూమిపూజ చేసిన సంగతి తెలిసిందే. యూనివర్సిటీ వరకు 200 ఫీట్ల నిర్మాణం చేస్తామని ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఓఆర్‌ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట యూనివర్సిటీ వరకు రోడ్డును ఎటువైపు నుంచి వేయాలనే అంశంపై రెవెన్యూ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. భూ నష్టం ఎక్కువ జరుగకుండా ప్రభుత్వ, అటవీ శాఖల భూముల నుంచి రోడ్డును వేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. రావిర్యాల ఓఆర్‌ఆర్ నుంచి కొంగరకలాన్, ఎల్మినేడు, తిమ్మాపూర్, రాచులూర్, గుమ్మడివెల్లి మీదుగా మీర్‌ఖాన్‌పేట వరకు రహదారిని నిర్మించాలనే ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం భూసేకరణ చేసింది. అయితే ఈ రోడ్డు నిర్మాణానికి 105 ఏకరాల పట్టా భూమి అవసరం కానున్నట్లు సమాచారం. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ రోడ్డు మార్గానికి భూసేకరణ చేయాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ దారే ఫైనల్ అయితే కొంగరకలాన్ పరిధిలో సుమారు 40 ఏకరాల వరక భూసేకరణ చేయాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఎల్మినేడు పరిధిలో భూసేకరణ చేయకుండా ఫారెస్టు భూముల నుంచి ఈ మార్గాన్ని తీసుకెళ్లాలనే ఆలోచనతో ఉన్నారు. వీలైనంత వరకు ప్రభుత్వ భూమి నుంచి ఈ రహదారిని నిర్మించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ముగిసిన ఐఈఈఈ-2024

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఐఈఈఈ–2024 సదస్సు విజయవంతంగా ముగిసింది. ది ప్లాజా వేదికగా గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో సుస్థిర శక్తి, భవిష్యత్ విద్యుత్ రవాణాలో తాజా పురోగతులను అన్వేషించడానికి ప్రఖ్యాత నిపుణులు, పరిశోధకులు చర్చలు జరిపారు.

ఎగుమతుల ఖిల్లా

అమెరికా, యూఏఈ సహా పలు దేశాలకు జిల్లా ఉత్పత్తులు

- ఔషధాలు, ఆర్గానిక్ కెమికల్స్, ఎయిర్, స్పేస్ క్రాఫ్ట్ పరికరాలు
- ఎలక్ట్రికల్ యంత్రాలు, అణు రియాక్టర్లు, బాయిలర్లు సైతం
- ప్రథమస్థానంలో మన జిల్లా.. దేశ ఆర్థిక సర్వేలో వెల్లడి



జిల్లా	ఎగుమతులు(రూ.కోట్లలో)	శాతం
రంగారెడ్డి	34,249	29
మేడ్చల్	25,444	22
సంగారెడ్డి	21,999	19
హైదరాబాద్	19,435	17
నల్లగొండ	2,961	3

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఐటీ అనుబంధ రంగాల్లోనే కాదు.. వస్తు ఉత్పత్తిలోనూ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 2023–24 దేశ ఆర్థిక గణాంకాల శాఖ సరుకుల ఉత్పత్తి, ఎగుమతికి సంబంధించిన జాబితాను ఇటీవల విడుదల చేసిన విషయం తెలిసిందే. వస్తు ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ టాప్‌లో ఉండగా, రాష్ట్రంలో మన జిల్లా రూ.34,249 కోట్ల విలువ చేసే వస్తువులను విదేశాలకు ఎగుమతి చేసి ఎగుమతుల ఖిల్లాగా గుర్తింపు పొందింది. ఆ తర్వాతి స్థానంలో జిల్లా సరిహద్దులోని మేడ్చల్, సంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాలు నిలిచాయి. ఎగుమతుల్లో ప్రధానంగా ఔషధాలు (36 శాతం), ఆర్గానిక్ కెమికల్స్ (20 శాతం), ఎయిర్ క్రాఫ్ట్, స్పేస్ క్రాఫ్ట్ పరికరాలు (14 శాతం), ఎలక్ట్రికల్ యంత్రాలు (6 శాతం), న్యూ క్లియర్ రియాక్టర్లు, బాయిలర్లు, మెకానికల్ ఉపకరణాలు (4 శాతం) వాటాను కలిగి ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది.

కొలువైన అనేక కంపెనీలు

ఫార్మా, లైఫ్ సైన్సెస్ కంపెనీలు అనేకం జిల్లాలో కొలువయ్యాయి. దేశంలోనే అతిపెద్ద ఆర్‌అండ్‌డీ (ఫార్మా పరిశోధనా సంస్థలు) ఉమ్మ డి జిల్లాలోని జీనోమ్ వ్యాలీలో ఉన్నాయి. ఇక్కడ 200కుపైగా బయోటెక్ కంపెనీలు ఉండగా, వీటిలో వ్యాక్సిన్లు తయారు చేసే ఐదు కంపెనీల్లో నాలుగు ఇక్కడే కొలువు దీరడం విశేషం. ఇక సేవా రంగంలోనూ కీలకమైన ఫైనాన్స్, ఐటీ, హెల్త్‌కేర్, ఎడ్యుకేషన్, టూరిజం రంగాల్లో ఆధునిక సాంకేతికత, డిజిటలైజేషన్, పెరిగిన గ్లోబల్ కనెక్టివిటీ తదితర అంశాలు సైతం వృద్ధికి కారణం.

దిగుమతి చేసుకుంటున్న దేశాలు

ఇక్కడి నుంచి దిగుమతి చేసుకుంటున్న దేశాల జాబితాలో యూఎస్ఏ (28.16శాతం) ముందు వరుసలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో యూ ఏఈ (6.90శాతం), సౌదీ అరేబియా (4.02శాతం), కువైట్ (3.71 శాతం), యూకే (3.10 శాతం), జర్మనీ(2.10 శాతం), రష్యా (1.88 శాతం), బంగ్లాదేశ్ (1.72శాతం), కెనడా (1.54 శాతం), ఇతర దేశాలు (41.6 7శాతం) ఉన్నట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది.

జిల్లాలో కంపెనీలు (రూ.కోట్లలో..)

పరిశ్రమలు	యూనిట్లు	పెట్టుబడి	ఉపాధి
సూక్ష్మ	2,680	978.13	33,673
చిన్న	1,388	3794.36	4196
మధ్య	108	2,377.74	11,367
భారీ	124	4,905.97	28,316
మెగా–తయారీ	29	9,661.95	13,699
మెగా–తయారీ	99	4,8618.95	6,98,796



స్వచ్ఛదనం-పచ్చదనం పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ శశాంక

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం: పల్లెలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన జీవనం సాగుతుందని కలెక్టర్ శశాంక అన్నారు. 'స్వచ్ఛదనం –పచ్చదనం' కార్యక్రమాన్ని సోమవారం ఇబ్రహీంపట్నంలో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, స్వచ్ఛదనం–పచ్చదనం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లారు. అంబేడ్కర్ చౌరస్తాలో స్వచ్ఛదనం–పచ్చదనాన్ని పరిరక్షిస్తామని విద్యార్థులు, అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవ మనుగడ ఉంటుదన్నారు. ప్లాస్టిక్ నివారణ, చెత్తచెదారం తొలగింపునకు రెడ్యూస్, రియూస్, రీసైకిల్ (త్రిబుల్ ఆర్) ప్రాతిపదికన ముందుకెళ్లాలన్నారు. తద్వార పర్యావరణ పరిరక్షణతోపాటు చాలవరకు ఖర్చులు తగ్గుతాయన్నారు. ఆరోగ్యవంతమైన మానవ జీవన మనుగడకు 33 శాతం అడవులుండాలని, ప్రస్తుతం 24 శాతం మాత్రమే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలు నాటి అడవులను పెంచేందుకు కృషిచేస్తే భవిష్యత్తుతరాల వారికి ఎంతో మేలు చేసినవారం అవుతామన్నారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో 82 లక్షల మొక్కలు నాటేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు తెలిపారు. వాతావరణం అనుకూలంగా కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోందన్నారు. పరిశుభ్రతను పాటించడమేగాక, చెట్లను పెంచడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి మాట్లాడుతూ.. ప్రజారోగ్యం మెరుగుపడేందుకు ఐదు రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, తహసీల్దార్ సునీత, కౌన్సిలర్లు ఆకుల మమత, నీలం శ్వేత, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డ్రగ్స్, గంజాయి రహిత అవగాహన వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ కేపీవీ రాజు తదితరులు

చెడుదారిలో పయనించొద్దు

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం: దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని, చెడుదారిలో పయనించొద్దని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన డ్రగ్స్, గంజాయి రహిత అవగాహన వాల్ పోస్టర్‌ను సోమవారం స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. వివిధ రంగాల్లో దేశం రాణించాలంటే యువత మేధస్సు, నైపుణ్యం అవసరమన్నారు. దురదృష్టవశాత్తు నేటి యువత కర్తవ్యాన్ని విస్మరిస్తూ మత్తులో తెలియాడుతూ జ్ఞానాన్ని,విచక్షణను, శక్తిసార్థ్యాలను కోల్పోయి నిస్తేజంగా మారుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు.సకల అనర్థాలు,అరాచకాలు,హత్యలకు మాదక ద్రవ్యాలు ప్రేరణ కలిగిస్తున్నాయన్నారు.ఇది సమాజానికి హానికరమన్నారు. డ్రగ్స్, గంజాయి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చా రు. గంజాయిని విక్రయించినా,కొనుగోలు చేసినా,సేవించినా చట్టరీత్యా కఠిన చర్యలుంటాయని ఏసీపీ హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్, అలంపల్లి జంగయ్య, చెనమోని రాఘవేందర్, యాదగిరి, మహమ్మద్ సయీఫ్, యాదగిరి పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో 180 అర్జీలు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 180 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వీలైనంత త్వరగా సమస్యలకు పరిష్కార మార్గం చూపాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బఫర్ జోన్‌లో బరితెగింపు!

ఆనవాళ్లు కోల్పోతున్న పీరం చెరువు

- మట్టితో పూడ్చి.. సెల్లార్లు తవ్వి.. నిర్మాణాలు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు



పీరంచెరువుకు అత్యంత సమీపంలో సెల్లారు

బండ్లగూడ: బఫర్‌జోన్‌లో కబ్జాదారులు బరితెగించారు. కంటికి రెప్పలా కాపాడాల్సిన ఇరిగేషన్ అధికారులు కళ్లుమూసుకుని నిరభ్యంతర పత్రాలు జారీ చేస్తున్నారు. ఫలితంగా చెరువులు, కుంటలు, కాల్వలు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే అనేక ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. తాజాగా పీరంచెరువు బఫర్ జోన్లలోనూ భారీ ఆక్రమణలు కొనసాగుతున్నాయి. గుట్టుగా మట్టిని నింపి, ఆ తర్వాత భారీ సెల్లార్లతో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. కళ్లముందే ఇంత జరుగుతున్నా.. ఇటు ఇరిగేషన్ అధికారులు కానీ, అటు రెవెన్యూ యంత్రాంగం కానీ కన్నెత్తి చూడకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆక్రమించి..ఆనవాళ్లు లేకుండా చేసి..

హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పక్కన 34.20 ఎకరాల విస్తీర్ణంలో పీరం చెరువు ఉంది. ఇక్కడ గజం రూ.లక్ష వరకు పలుకుతోంది. కొంత మంది రియల్టర్లు చెరువులు, కుంటలు, బఫర్‌జోన్లపై కన్నేశారు. గుట్టుగా వాటిని ఆక్రమించి హద్దు రాళ్లు నాటి, ఆ తర్వాత లోతట్టు ప్రాంతాల్లో మట్టి నింపుతున్నారు. లే అవుట్లు తయారు చేసి, రోడ్లు వేశారు. ఫలితంగా ప్రస్తుతం చెరువు తన ఆనవాళ్లు కోల్పోయింది. ఇప్పటికే పది ఎకరాలకుపైగా అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం 24 ఎకరాలే మిగిలింది. నిజానికి చెరువు బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వకూడదు. కానీ ఇరిగేషన్ అధికారులు ఇవేవీ పట్టించుకోలేదు. ఇటీవల ఏసీబీకి చిక్కిన ఓ ఇరిగేషన్ ఏఈ నిఖేష్ అడ్డగోలుగా ఎన్‌ఓసీలు జారీ చేశారు. వీటిలో ఇప్పటికే అనేక బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. తాజాగా ఓ రియల్టర్ ఏకంగా బఫర్‌జోన్‌లో భారీ ఎత్తున సెల్లార్ తవ్వకాలకు తెర తీశాడు. బహుళ అంతస్తుల భవనం నిర్మాణానికి ఇటు ఇరిగేషన్, అటు హెచ్ఎండీఏ ఏ విధంగా అనుమతి ఇచ్చిందనేదీ అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది.

కన్నెత్తి చూడని అధికారులు

చెరువు ఆనవాళ్లు లేకుండా చేస్తున్నా.. సంబంధిత అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. నీటిపారుదల అధికారులు జారీచేసిన నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీ) పరిశీలించి, పీరంచెరువు కొలతలతో హద్దులు ఏర్పాటు చేసి బఫర్ జోన్లలో జరుగుతున్న నిర్మాణాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ అంశంపై గండిపేట తహసీల్దార్ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా, చెరువులు, కుంటల పరిరక్షణ బాధ్యత పూర్తిగా ఇరిగేషన్ శాఖదేనని, బఫర్‌జోన్లపై వారికే అవగాహన ఉంటుందని, ఏది ఏమైనా ఇరిగేషన్‌శాఖ అధికారులను సమన్వయం చేసుకుని ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే ఇదే అంశంపై ఇరిగేషన్ డీఈ రమను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా, ఆమె స్పందించకపోవడం కొసమెరుపు.



బఫర్ జోన్‌లో భారీ నిర్మాణాలు



అక్వేరియం ఏమైనట్టు!

- కొత్వాల్‌గూడ ఎకో పార్కులో టన్నెల్ అక్వేరియానికి ప్రణాళికలు
- రెండుసార్లు టెండర్లు పిలిచినా స్పందన శూన్యం
- ఇంకా పెండింగ్‌లోనే ప్రాజెక్టు

సాక్షి, సిటీబ్యూరో: అక్వా మెరైన్ పార్కు.. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టన్నెల్ ఎక్వేరియం ప్రాజెక్టు ఇది. కొత్వాల్‌గూడ ఎకో పార్కులో అత్యాధునిక హంగులతో అక్వేరియం నిర్మాణానికి అప్పట్లో ప్రణాళికలను రూపొందించింది. ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని తలపెట్టింది. ఏళ్లు గడిచినా ఆ ప్రాజెక్టు ఆచరణకు నోచలేదు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్మించాలని భావించారు. రెండుసార్లు టెండర్లు కూడా ఆహ్వానించారు. నిర్మాణ సంస్థల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదు. ప్రస్తుతం ఎకో పార్కు తుది దశకు చేరుకుంది. టన్నెల్ ఎక్వేరియం ఏర్పాటు మాత్రం పెండింగ్ జాబితాలో పడిపోయింది. కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఇటీవల హెచ్ఎండీఏ చేపట్టిన పలు అభివృద్ధి ప్రాజెక్టులు, పార్కులను పరిశీలించారు. ఈ క్రమంలో గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన టన్నెల్ ఎక్వేరియంపైన ప్రస్తుతం ఎలా ముందుకు వెళ్లనున్నదనేది చర్చనీయాంశంగా మారింది. సుమారు రూ.150 కోట్లతో ప్రతిపాదించిన ఎక్వేరియం ప్రతిపాదన ఉన్నట్లా? లేనట్లా అనే అంశంపై సందిగ్ధం నెలకొంది.

నగర పర్యాటకానికి మణిహారం

హిమాయత్‌సాగర్‌కు చేరువలో హెచ్ఎండీఏ 85 ఎకరాల విస్తీర్ణంలో కొత్వాల్‌గూడ ఎకోపార్కు నిర్మాణం చేపట్టింది. నగరవాసులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అందమైన, ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగించేలా పార్కును విస్తరించారు. ఈ పార్కులోనే సుమారు 4.27 ఎకరాల్లో టన్నెల్ ఎక్వేరియం ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టారు. ఇందుకోసం దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎక్వేరియంలపై అధికారులు అధ్యయనం చేశారు. ఇప్పటి వరకు ఉన్న అన్ని అక్వా మెరైన్ పార్కుల కంటే మరిన్ని ఆధునిక హంగులతో దీన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. పీపీపీ పద్ధతిలో ప్రతిపాదించిన ఈ భారీ ఎక్వేరియం నిర్మాణానికి కాంట్రాక్టు సంస్థలు ముందుకు రాలేదు. గత సంవత్సరం రెండుసార్లు టెండర్లు పిలిచారు. స్పందన రాకపోవడంతో కొంతమంది ఆసక్తి కలిగిన డెవలపర్లతో ప్రీ బిడ్ సమావేశం ఏర్పాటు చేశారు. వారి నుంచీ పెద్దగా స్పందన లేదు. ప్రాజెక్టు పెండింగ్‌లో పడిపోయింది. దీంతో దీనిపై మరోసారి ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై అధికారులు ప్రస్తుతం సమాలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టేయడమా లేక, మరోసారి ఆసక్తి నిర్మాణ సంస్థల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి విధి విధానాల్లో మార్పులు చేయడమా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారినట్లు అధికారులు తెలిపారు. కొద్ది రోజుల్లోనే ఈ ప్రాజెక్టుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రంగురంగుల చేపలతో..

- కొత్వాల్‌గూడ ఎకో పార్కు ఏర్పాటు కోసం, చెన్నై వీజీటీ మెరైన్‌పార్కు, అహ్మదాబాద్ సైన్స్‌సిటీ ప్రాజెక్టులపై అధికారులు అధ్యయనం చేశారు. తరువాత దేశంలోనే అతి పెద్ద టన్నెల్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.
- రంగురంగుల చేపలు, మెరైన్ స్పీసెస్, బహుళ టన్నెల్స్‌తో మెగా అక్వామెరైన్ పార్కును అందంగా తీర్చిదిద్దాలని భావించారు. షార్క్ చేపల నుంచి డాల్ఫిన్ల వరకు ఉంటాయి. సందర్శకులకు అద్భుతమైన అనుభూతినిచ్చేలా, అతి పెద్ద జలాశయం అడుగున పర్యటిస్తూ వీక్షిస్తున్న అనుభూతి కలిగించేలా ఉంటుంది.
- అలాగే అక్వేరియంను దగ్గరి నుంచి వీక్షించేందుకు అనుగుణంగా ఒక రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.
- అతి పెద్ద డోమ్ థియేటర్, సెవెన్ డీ థియేటర్, వర్చువల్ ఎక్వేరియం, టచ్ ట్యాంక్స్, హెల్మెట్ ఎక్వేరియం వంటివి ఏర్పాటు చేసేందుకు అప్పట్లో ప్రణాళికలు రూపొందించారు.
- అలాగే పిల్లల కోసం కియోస్క్‌లను కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
- కనీసం 2500 మంది ఒకేసారి సందర్శించేందుకు వీలుగా సుమారు 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలని భావించారు. అక్వేరియంలో ఏర్పాటు చేసే టన్నెల్ ట్యాంక్ మలుపు 180 డిగ్రీల కోణంలో ఉంటుంది.
- కనీసం 100 మీటర్ల పొడవు, 3.5 మీటర్ల వెడల్పు వాక్ వేలతో టన్నెల్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.
- మొత్తం అక్వేరియం సుమారు 3 వేల మిలియన్ లీటర్ల నీటి సామర్థ్యానికి తగ్గకుండా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

నిరుపేదలకు భూ పంపిణీ చేయాలి

- పొజిషన్‌లో ఉన్న రైతులకు పట్టాపాస్ బుక్‌లు ఇవ్వాలి
- సీపీఎం జిల్లా అధ్యక్షుడు భాస్కర్
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

తలకొండపల్లి: ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఖానాపూర్ శివారులోని 16, 18, 20సర్వే నంబర్లలో 24.20 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని గ్రామానికి చెందిన కొందరు కోర్టు నుంచి ఓఎస్ నంబర్ ద్వారా డిగ్రీ పొంది ఆర్‌ఓఆర్ రికార్డుల్లో నమోదు చేసుకున్నారని ఆరోపించారు. అట్టి భూమిని పట్టా భూమిగా మార్పిడి చేయించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భూమిని వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. 145/1 సర్వే నంబర్‌లో 10.23 ఎకరాల సీలింగ్ భూమిని భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. 1992లో చౌదర్‌పల్లి గ్రామంలో భూ పోరాటం చేసి పేదలకు పట్టాలు ఇచ్చామన్నారు. మూడు దశాబ్దాలుగా పొజిషన్‌లో ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు నేటికీ లబ్ధిదారుల పేర్లు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొజిషన్‌లో ఉన్న రైతులకు తక్షణమే పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రంగారెడ్డికి భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ కన్వీనర్లు కానుగుల వెంకటయ్య, పెంటయ్య, మండల కార్యదర్శి కురుమయ్య, శివ శంకర్, పోచయ్య, లింగయ్య, గోపయ్య, పాపయ్య, రాములు, లక్ష్మమ్మ, శ్రీలత, అంజయ్య, యాదయ్య, శ్రీశైలం, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాం

తెలంగాణ మాలల ఐక్య వేదిక


డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న మాల మహానాడు నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును నిరసిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సోమవారం సంఘం నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ మాలల ఐక్య వేదిక ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ ధర్నా చేపట్టామన్నారు. సుప్రీం తీర్పును మోదీ తీర్పుగా భావిస్తున్నామన్నారు. దళితులకు కావాల్సింది వర్గీకరణ కాదని రిజర్వేషన్లను 15 నుంచి 20 శాతానికి పెంచాలన్నారు. ఇందుకు దళిత సంఘాలన్నీ ఐక్యంగా పోరాడుతాయన్నారు. నరేంద్ర మోదీ సహచరులైన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావుకు రాష్ట్రంలోని 50లక్షల మంది మాలల శక్తి చూపుతామన్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణన్, గుండాలు, భర్తాకి జగన్, మహేశ్, కృష్ణ, పోచన్న, ధన్‌రాజ్, శివకుమార్, కాశీనాథ్‌తో తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఆలయంలో చోరీ

మొయినాబాద్: ఆంజనేయ స్వామి ఆలయంలో ఓ దుండగుడు హుండీ పగులగొట్టి డబ్బులు దోచుకెళ్లాడు. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దమంగళారంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో అర్ధరాత్రి ఓ దొంగ చొరపడ్డాడు. హుండీ తాళం పగులగొట్టి అందులో డబ్బు ఎత్తుకెళ్లాడు. సోమవారం స్వామి దర్శనానికి వెళ్లిన భక్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గుడిలోని సీసీ కెమెరాలు పరిశీలించారు. దొంగతనం చేసిన తీరు సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగను పట్టుకునే పనిలో ఉన్నారు.



రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొట్టిన బైక్

బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి


తల్లి మృతదేహం పక్కన కూర్చుని బిత్తర చూపులు చూస్తున్న కూతురు

తుర్కయంజాల్: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలోని తుర్కయంజాల్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఇంజాపూర్ శ్రీ రంగాపురం కాలనీలో అద్దెకుండే రేణుక (40) మిర్చీ బండి నడిపిస్తూ జీవనం సాగిస్తోంది. సోమవారం రాత్రి 8.30గంటల ప్రాంతంలో నూనె ప్యాకెట్ తెచ్చేందుకు రోడ్డు దాటుతుండగా తుర్కయంజాల్ నుంచి బీఎన్‌రెడ్డి వైపు ప్రయాణిస్తున్న బుల్లెట్ బైక్ ఆమెను వేగంగా ఢీకొట్టింది. దీంతో రేణుక రోడ్డుపై ఎగిరిపడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త రాజు, కొడుకు, కూతురున్నారు. కూతురుకు మానసిక స్థితి సరిగా లేక తల్లి మృతి చెందిన విషయం తెలియకుండా అక్కడే తచ్చాడుతుండడం పలువురిని కలిచి వేసింది. కుటుంబ బరువంతా మోసే రేణుక మృతి విషయం తెలుసుకున్న స్థానికులు, బంధువులు పెద్ద ఎత్తున ఘటనా స్థలికి చేరకుని రోడ్డుపైనే బైఠాయించారు. రెండున్నర గంటలపాటు ఆందోళన చేపట్టారు. పోలీసులు బుల్లెట్ నడుపుతున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా ఆ యువకుడు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ట్యాంక్‌బండ్‌పై కారు బీభత్సం

లక్డీకాపూల్: మైనర్లు కారు నడుపుతూ డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటన సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. లంగర్‌హౌస్ ప్రాంతానికి చెందిన యువకులు సోమవారం తెల్లవారుజామున ట్యాంక్‌బండ్‌పై తినడానికి వచ్చారు. ఈ క్రమంలో మైనర్లు నడుపుతున్న కారు అదుపు తప్పి బీభత్సం సృష్టించింది. దీంతో స్థానికులు వెంబడించడంతో భయంతో ఐమాక్స్ థియేటర్ వద్ద డివైడర్‌ను ఢీ కొట్టారు. ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారును సీజ్ చేసి మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజల భాగస్వామ్యమే ప్రధానం

'స్వచ్ఛదనం–పచ్చదనం'లో పాల్గొన్న రాష్ట్ర ఆర్‌డీసీ ఛైర్మన్ రాంరెడ్డి


కడ్తాల్: మొక్కలు నాటి నీరు పోస్తున్న డీటీడీఓ రామేశ్వరి దేవి, ఎంపీడీఓ సుజాత తదితరులు


తుర్కయంజాల్: మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

తుర్కయంజాల్: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తుర్కయంజాల్ చౌరస్తా నుంచి మాసబ్ చెరువు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలంతా మొక్కలు నాటి వాటిని రక్షించాలని సూచించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ మాట్లాడుతూ.. మాసబ్ చెరువును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఐదు రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితాధన్‌రాజ్ గౌడ్, కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు కొత్తకుర్మ మంగమ్మ శివ కుమార్, కోశిక ఐలయ్య. మేతరి అనురాధ దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం: డీటీడీఓ

కడ్తాల్: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని గిరిజన సంక్షేమాభివృద్ధి జిల్లా అధికారి(డీటీడీఓ), మండల ప్రత్యేకాధికారి రామేశ్వరి దేవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో అధికారులు, నాయకులు, విద్యార్థులు కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం రాజేశ్వరి, హెచ్‌ఎం జంగయ్య, అరుణ, వీఓఏలు వనిత, లావణ్య నాయకులు రాజేందర్, రాజేశ్, నరేశ్‌నాయక్, శ్రీను, భీముడు తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


డీసీపీ శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న నాగిరెడ్డిగూడ గ్రామస్తులు

- యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి
- సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి
- రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

మొయినాబాద్: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో పోలీసులకు ప్రజలకు మధ్య ఉండాల్సిన సత్సంబంధాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్, గంజాయి, కొకైన్‌లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దన్నారు. ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి నేరాలు, దొంగతనాలు, గొడవలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతీ ఒక్కరి వద్ద ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐ, గ్రామ పోలీస్ అధికారి, పోలీస్‌స్టేషన్ నంబర్లు ఉండాలన్నారు. ఫాంహౌస్‌లలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. ఎక్కడైనా జరిగినట్టు గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నర్సింహరాజు, గ్రామ పోలీసు అధికారి రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అర్జున్, నాయకులు మనోజ్‌కుమార్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగలకు రిమాండ్

రూ.1.20లక్షల నగదు, 14 సెల్‌ఫోన్లు స్వాధీనం

శంకర్‌పల్లి: మొబైల్ షాప్‌లో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. జులై 25న అర్ధరాత్రి మోకిలలో బాలాజీ మొబైల్ షాపులో గుర్తు తెలియని దుండగులు దొంగతనం చేసినట్లు యజమాని జీవన్ జులై 26న పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను లంగర్ హౌస్‌లో గుర్తించారు. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన దుర్గారెడ్డి(33), షేక్ మహబూబ్(31)ను మోకిల, రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో వీరిపై పలు పోలీస్‌స్టేషన్లలో పదుల సంఖ్యలో కేసులున్నట్లు తేలింది. నిందితుల వద్ద రూ.1.20లక్షల నగదు, 14 సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం చేవెళ్ల కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్ నిమిత్తం సంగారెడ్డి జిల్లా కందికి జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

అతివేగంతో ప్రమాదం

బైక్ అదుపుతప్పి యువతి మృతి

శంకర్‌పల్లి: అతి వేగం ఓ యువతి మృతి కారణమైంది. ఈ ఘటన ఆదివారం రాత్రి శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మహాలింగపురం వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గడి మల్కాపూర్ గ్రామానికి చెందిన సదా(23)కు మొయినాబాద్ మండలం అప్పారెడ్డిగూడకు నవీన్‌తో ఏడాది క్రితం వివాహమైంది. జులై 30న బోనాల ఉత్సవాలకు తల్లిగారింటికి వెళ్లింది. ఈ నెల 4న నవీన్ తమ్ముడు నరేందర్‌తో కలిసి సదాని తీసుకువెళ్లేందుకు గడి మల్కాపూర్ వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. వీరు మహాలింగపురం శివారులో రోడ్డుపై ఉన్న గుంతలో పడిపోవడంతో సదా తలకు తీవ్ర గాయాలవ్వగా.. అన్నదమ్ములు స్వల్పంగా గాయపడ్డారు. సదాకు శంకర్‌పల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



షాద్‌నగర్‌రూరల్: రైలు పట్టాల పక్కన సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ శివారులో రాత్రి సుమారు పది గంటల ప్రాంతంలో గ్రామస్తులు గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే వారు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఘటనా స్థలికి చేరుకుని పంచనామా చేశారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని.. మృతుడు ప్రయాణిస్తున్న రైలులోంచి పడిపోయాడా..? ఆత్మహత్య చేసుకున్నాడా..? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించనున్నారు.

నేడు గద్దర్ ప్రథమ వర్ధంతి

సాక్షి, సిటీ బ్యూరో: గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి రవీంద్రభారతిలో గద్దరన్న యాదిలో.. ప్రథమ వర్ధంతి కార్యక్రమం జరుగుతుంది. బుద్ధ వనం గద్దరన్నకు పాటల నివాళితో పాటు ప్రజా సంఘాలు, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు, కవులు, రచయితలు, పాత్రికేయులు, సినీ ప్రముఖులు, విద్యావంతులు, రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొంటారు.

సారా, గంజాయిపై ఉక్కుపాదం

ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్

కడ్తాల్: నాటుసారా, గంజాయి విక్రయాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ తల్లి ఆలయ సమీపంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఆమనగల్లు ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ మాట్లాడుతూ.. దురలవాట్లతో భవిష్యత్ అంధకారం చేసుకోవద్దని సూచించారు. గంజాయి, గుడుంబా విక్రయాలపై ఎక్సైజ్ శాఖ పటిష్ట నిఘా కొనసాగిస్తోందని అక్రమంగా మద్యం, మత్తు పదార్థాలు విక్రయించినా.. కొనుగోలు చేసినా చర్యలు తప్పవన్నారు. అపరిచిత వ్యక్తులు చాక్లెట్లు తదితర వస్తువులు ఇస్తే నిరాకరించాలన్నారు. తమ పిల్లల అలవాట్లను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. గుడుంబా తయారీదారులు, విక్రయదారులను బైండోవర్ చేసేందుకు సహకరించాలని కోరారు.

ఈవెంట్ పర్మిషన్ తీసుకోవాలి

కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల్, తలకొండపల్లి మండలాల పరిధిలోని అన్ని ఫంక్షన్‌హాల్స్, రిసార్ట్స్, ఫాంహౌస్‌లలో మద్యంతో పార్టీలు ఏర్పాటు చేస్తే తప్పకుండా తప్పకుండా ఈవెంట్ పర్మిట్ తీసుకోవాలని.. లేదంటే మద్యాన్ని సీజ్ చేసి ఫంక్షన్ హాల్ యజమానిపై చట్టారీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అట్టి ఫంక్షన్ హాల్స్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు కృష్ణ ప్రసాద్, అరుణ్‌కుమార్, స్వప్న, ఎక్సైజ్ సిబ్బంది శంకర్, దశరథ్, బాబు, నర్సింహ, లోక్యా, శ్రీజ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాయితో కొట్టి వృద్ధురాలి హత్య

హస్తినాపురం: ఇళ్లలో పనిచేస్తూ జీవనం గడుపుతున్న వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తి బండరాయితో తలపై కొట్టి హత్య చేసిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చీమల బాలమ్మ(63) కృష్ణానగర్‌కాలనీలో దాదాపు 30 ఏళ్లుగా నివాసం ఉంటోంది. చుట్టుపక్కల ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. సోమవారం ఇళ్లలో పనిచేయడానికి రాకపోవడంతో పక్కనే ఉన్న వారు బాలమ్మ ఇంట్లోకి వెళ్లి చూశారు. ఆమె మృతి చెంది ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాలమ్మ మృతదేహాన్ని పరిశీలించగా మృతురాలి తలపై రాయితో కొట్టిన గాయాలు ఉన్నాయని, గుర్తు తెలియని వ్యక్తి హత్యచేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కాలనీకి చెందిన చింతకాయల హరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీ లిఫ్ట్ అడిగి.. బస్సు, రైలెక్కి

- ట్యూషన్‌కని వెళ్లి అదృశ్యమైన బాలుడు
- కిడ్నాప్‌గా భావించి పీఎస్‌లో ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- బాలుడే స్వయంగా వెళ్లినట్లు సీసీ ఫుటేజీల ద్వారా నిర్ధారించిన పోలీసులు
- ఆచూకీ కోసం నాలుగు ప్రత్యేక బృందాల ఏర్పాటు


మహిధర్‌రెడ్డి (ఫైల్)


మలక్‌పేట రైల్వేస్టేషన్‌లో టికెట్ తీసుకుంటున్న బాలుడు

మీర్‌పేట: ట్యూషన్‌కు వెళ్తున్నాని ఇంట్లో నుంచి వెళ్లిన బాలుడు కనిపించకుండా పోయాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. జిల్లెలగూడ దాసరి నారాయణరావు కాలనీకి చెందిన మధుసూదన్‌రెడ్డి, కవిత దంపతుల కుమారుడు మహిధర్‌రెడ్డి(13) స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతన్నారు. రోజుమాదిరిగానే ఆదివారం మధ్యాహ్నం 3.30గంటలకు తన అన్నతో కలిసి సర్వోదయనగర్‌లో ట్యూషన్‌కు బయలుదేరాడు. వీరు నిత్యం లిఫ్ట్ అడిగి వెళ్తుంటారు. ఓ బైక్ ఆపగా.. అన్నను వెళ్లమని చెప్పిన మహిధర్ తాను తర్వాత వస్తానన్నాడు. అనతరం మరో స్కూటీని లిఫ్ట్ అడిగి మీర్‌పేట్ బస్టాండ్ వద్ద దిగి అక్కడ నుంచి మిథాని డిపోకు చెందిన ఉమెన్స్ కాలేజీ బస్‌లో మలక్‌పేట్ రైల్వే స్టేషన్ బస్టాప్‌లో దిగాడు. రైల్వే స్టేషన్‌కు వెళ్లి టికెట్ తీసుకుని రైలు ఎక్కాడు.

ముందుగా కిడ్నాప్ అనుకుని..

ట్యూషన్‌కు వెళ్లిన కొడుకు తిరిగి రాకపోవంతో కంగారుపడిన తల్లిదండ్రులు కిడ్నాప్ అనుకుని మీర్‌పేట ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఇంట్లో నుంచి వెళ్లేప్పుడు రూ.2 వేలు తీసుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించగా బాలుడు తనంతట తానే లిఫ్ట్ అడిగి.. బస్ ఎక్కి, అనంతరం రైలులో వెళ్లినట్లు గుర్తించారు. సొంతూరు కర్నూల్ వెళ్లి ఉంటాడని భావించి అక్కడి పోలీసులు, బంధువులను అప్రమత్తం చేశామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. ఏసీపీ కాశిరెడ్డి మీర్‌పేటకు వచ్చి సీసీ ఫుటేజీ పరిశీలించారని.. నాలుగు ప్రత్యేక బృందాలను రంగంలోకి వెతుకుతున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా గోవా టికెట్ తీసుకున్న బాలుడు రైలెక్కి అక్కడకు వెళ్లినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.